క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న భౌతికశాస్త్రం అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు సాధించి అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

15వ ఆర్థిక సంఘ నిధుల విడుదలపై హర్షం

కాశీబుగ్గ : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.989 కోట్లు విడుదల చేయడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.పంచాయతీలకి మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.

గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న కుమార్‌రాజు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి పెట్టాలి



అవగాహన కల్పిస్తున్న కృష్ణారావు

కోటబొమ్మాళి: వరి పైరును ఆశిస్తున్న తెల్ల దోమ, ఇతర తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని రైతుశిక్షణ కేంద్రం సహాయ సంచాలకుడు కె.కృష్ణారావు అన్నారు. తిలారు రైతుసేవా కేంద్రంలో గురువారం తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెక్కలి ఏడీ బి.వి.తిరుమలరావు, ఏఓ ఎస్.గోవిందరావు పాల్గొన్నారు.

బొడ్డపాడు విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రాపాక భరత్, ప్రణీత్, జడ్డె పూజ, మామిడి లోహిత, జి.గోపాలకృష్ణ, దాసరి సాయికుమార్, మోహన్‌కృష్ణలు కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గురువారం హెచ్‌ఎం ఎ.వీర్రాజు, పీడీ రామ్‌జీ అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందించారు.

నీట మునిగిన శ్రీనివాసనగర్



జలమయమైన రోడ్లు

టెక్కలి రూరల్: టెక్కలి పంచాయతీ శ్రీనివాస నగర్ గురువారం కురిసిన వర్షానికి జలమయమైంది. మధ్యాహ్నం సుమారు గంట పాటు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో రోడ్లు నీటితో నిండిపోయాయి. కొన్నాళ్లుగా ఇక్కడి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోతోంది. రోడ్లు తనీటి ప్రవాహంతో నిండిపోవడంతో వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు.

కుమార్‌నాయక్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

కాశీబుగ్గ: 60 సంఘాల్లో ఉంటూ విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ కుమార్‌నాయక్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

కోటబొమ్మాళిలో స్తంభించిన సచివాలయ సేవలు

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని కోటబొమ్మాళి-1, 2 సచివాలయాల్లో రెండు వారాల కిందట కంప్యూటర్లు మొరాయించడంతో సేవలు నిలిచిపోయాయి. అధికారులు వీటి మరమ్మతు విషయాన్ని పట్టించుకోకపోవడంతో కుల, ఆదాయ, 1బీ, అడంగల్ తదితర ధ్రువపత్రాలు అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల శ్రమదానం



టెక్కలి మండలం శ్యామసుందరాపురం సమీపంలో సాగునీటి కాలువల్లో రైతులు గురువారం పూడికలు తొలగించారు. వంశధార 46 ఎల్ఆర్ వజ్జ జగన్నాథం తోట నుంచి శ్యామసుందరాపురం వరకు పూడికలు పేరుకుపోవడంతో సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి అప్పలనాయుడు, రైతులు గుంట నాగభూషణ్ ఆధ్వర్యంలో రైతులే స్వచ్ఛందంగా కాలువ పని చేశారు. - టెక్కలి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గర్భిణులు, బాలింతలు, కిశోరీ బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్.ఇందిర అన్నారు. గోకర్ణపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం జలంత్రకోట క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులతో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి పౌష్టికాహార ఆవశ్యకతపై నినాదాలు చేశారు. - కంచిలి



నయనం ప్రధానం



జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా కొల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ విద్యార్థులను పరీక్షించి 16 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఉచిత కళ్లద్దాల కోసం సిఫార్సు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రామారావు, ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. - సంతబొమ్మాళి

కేజీబీవీలో అభివృద్ధి పనులకు బ్రేక్

- రూ.10లక్షల నిధులు మంజూరైనా జరగని పనులు
- టీడీపీ కేడర్ మధ్య తెగని పంచాయితీ
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు





కేజీబీవీలో మరమ్మతుకు గురైన సెప్టిక్ ట్యాంక్ (ఇన్‌సెట్లో) కేజీబీవీని ఆనుకుని ఉన్న మురుగుకాలువ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అభివృద్ధి పనులకు జూలైలో రూ.10లక్షల నిధులు మంజూరైనా పనులు మాత్రం జరగడం లేదు. ఈ పనులు చేసే విషయమై స్థానిక టీడీపీ నాయకులు అంతర్గత కుమ్ములాటలకు దిగడంతో మూడు నెలలుగా పనులు నిలిచిపోయాయి. జూలై నెలలో కేజీబీవీలో 22 మంది బాలికలు డయేరియా బారిన పడ్డారు. పారిశుధ్య లోపం కారణంగా డయేరియా వ్యాపించిందని అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఆ మేరకు కేజీబీవీలో మరుగుదొడ్లకు సంబంధించిన సెప్టిక్ ట్యాంకు, మురుగు కాలువలు కొత్తగా నిర్మించాలని రూ.10 లక్షల నిధులను మంజూరు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ పనులను నామినేట్‌గా చేయాల్సి ఉండగా, టీడీపీ వర్గీయుల మధ్య సయోధ్య కుదరక ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో కేజీబీవీలో పారిశుధ్య పరిస్థితులు క్షీణిస్తున్నాయి. మురుగునీరు నిల్వ ఉండిపోయి దోమలు వ్యాపిస్తున్నాయి.

ప్రస్తుతం వాడుకలో ఉన్న సెప్టిక్ ట్యాంకు శిథిల దశకు చేరడంతో మరుగుదొడ్ల నుంచి వస్తున్న మురుగు పైప్‌లలోనే ఉండిపోతోంది. దీంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. నిధులు మంజూరైనా టీడీపీ నాయకులు పనులు చేపట్టకపోవడంపై విద్యార్థినుల తలిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ఎవరికి అప్పగించాలో తెలీక సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రశాంతి తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షునిగా ధర్మాన కృష్ణదాసును, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తమ్మినేని సీతారాంను నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. - సోంపేట/టెక్కలి/కాశీబుగ్గ

27న పీఓడబ్ల్యూ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న పోతనపల్లి కుసుమ

పలాస: జిల్లా కేంద్రంలోని ఇలిసిపురంలో అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఈ నెల 27న జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) 7వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉద్దానం ప్రాంతంలోని పలుగ్రామాల్లో గురువారం పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాకన్నపల్లిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలపై సాగుతున్న హత్యలు, అత్యాచారాలు, పీడనలు, వివక్ష, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పి.ఓ.డబ్ల్యూ కొన్నేళ్లుగా పోరాటం సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, పి.హేమక్క, కె.జానకమ్మ, కె.సావిత్రమ్మ, పుణ్యవతి, పి.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రైలు నిలయంలో సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఎం బజ్వాకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక రైలు యూజర్ కమిటీ జెడ్ఆర్‌యూసీసీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఒడిశాలోని ఖుర్దా రోడ్డులో ఈస్ట్‌కోస్ట్ రైల్వేమేనేజర్ (డీఆర్‌ఎం) హెచ్‌ఎస్ భజ్వాను కలిసి సమస్యలు వివరించారు. రైలునిలయం పడమర వైపు ప్రవేశ ద్వారం ఏర్పాటుచేయాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పొడిగించాలని, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయాలని, ఎల్‌సీ గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, జగనన్న కాలనీకి వెళ్లేందుకు అండర్‌పాస్ రోడ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కట్టా సూర్యప్రకాశ్, వి.కె.ప్రసాద్, డి.గోపాల్, వి.రాజు పాల్గొన్నారు.

రూ.38,001 పలికిన వినాయక లడ్డూ

కంచిలి: కంచిలి మెయిన్‌రోడ్డులోని స్టేట్ బ్యాంకు కూడలిలో ఏర్పాటు చేసిన 13 అడుగుల వినాయక విగ్రహం వద్ద నైవేద్యంగా ఉంచిన లడ్డూకు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన బికారి చరణ్ రాథో రూ.38,001లకు లడ్డూను దక్కించుకొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్.పేట, పురుషోత్తపురం, ముచ్చింద్ర, కేదారిపురం, రత్తకన్న, మశాఖపురం, మండపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.ప్రసాదరావు తెలిపారు.

కాశీబుగ్గ: బ్రాహ్మణతర్లా, లక్ష్మీపురం, వెంకటాపురం, అనంతగిరి, ఉంద్రుకుడియా, మోదుగుల పుట్టి, కైజోల, మహాదేవపురం టెక్కలి పట్నం, కేశపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, అమలకుడియా, ఈదురాప ల్లి, పూర్ణభద్ర పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉద యం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ పైడి యోగేశ్వరరావు, ఏఈ జి.వి.రమణ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కృపారాణి, నాయకులు

టెక్కలి: ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని బెదిరించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం టెక్కలి ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నాయకుడు త్రివేంద్రసింగ్ తదితరులు రాహుల్‌పై బెదిరింపులకు పాల్పడ్డారని, తక్షణమే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టెక్కలి డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.పరమేశ్వరరావు, కె.రామ్మోహన్‌రావు, కె.మధుసూదనరావు, ఎం.చక్రవర్తిరెడ్డి, కె.వెంకటరావు, ఎం.నర్సింహమూర్తి, కె.మల్లేశ్వరరావు, పి.ఆనంద్, టి.బి.జి.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



ఇచ్ఛాపురం రూరల్: గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న ఎంపీపీ బోర పుష్ప



పలాస: చిన్నారులకు అన్నప్రాసనం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఐసీడీఎస్ అందిస్తున్న పోషకాహారంతో ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. గురువారం అరకబద్ర అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి, గ్రామపెద్దలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ అన్నారు. గురువారం ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో బొడ్డపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గర్తం తులసీరావు, పోతనపల్లి దివ్య, రామ్‌జీ, సూపర్‌వైజరు ఉర్నాన దానమ్మ, పంచాయతీ కార్యదర్శి నగిరి మీనాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.

విశ్వకర్మకు విశేష పూజలు



ఇచ్ఛాపురం రూరల్: విశ్వకర్మను దర్శించుకుంటున్న భక్తులు



వజ్రపుకొత్తూరు: విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండిలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పూజా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విశ్వకర్మ విగ్రహాన్ని బాహుదానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట మామయ్య రెడ్డి, సంతు ఆచారి, భాస్కర్, విశ్వనాథం, కూర వెంకటరావు, రాము, గోపీ, సాయి, కామేష్, మోహనరావు, సోపూ ఆచారీ పాల్గొన్నారు.

వార్డుల కొరతతో ఇక్కట్లు

- పలాస సీహెచ్‌సీలో ఇన్‌పేషెంట్ రోగులకు తప్పని అవస్థలు
- వసతి సమస్యను పట్టించుకోని పాలకులు



పలాస సీహెచ్‌సీలో రోగులకు, సహాయకులకు ఒకే బెడ్ (ఇన్‌సెట్లో) ఒకే వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

కాశీబుగ్గ : పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ వార్డుల్లో వింత పరిస్థితి నెలకొంది. సరైన వసతి సౌకర్యం లేకపోవడంతో స్త్రీ, పురుష రోగులంతా ఒకే చోట వైద్యసేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలుత ఇక్కడ పురుషులు, మహిళలకు వేర్వేరుగా వార్డులు ఉండేవి. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు పురుషుల వార్డును, మహిళలు వార్డులను ఒకేచోట కలిపేశారు. మహిళా వార్డును డయాలసిస్ యూనిట్‌గా మార్చేశారు. అప్పటి నుంచి మహిళలు, పురుషులు తేడా లేకుండా ఒకే గదిలో వైద్య సేవలు అందిస్తున్నారు. వారితో పాటు వచ్చిన సహాయకులకు సైతం షెల్టర్ లేకపోవడంతో వారు కూడా రోగితో పాటే బెడ్‌పైనే ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేర్వేరుగా వార్డులను ఏర్పాటు చేసి వసతులు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ



సోంపేట: మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ మాధవరావు



ఇచ్ఛాపురం: అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్

సోంపేట: ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలని జిల్లా వై.సి.బి.సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'మీకు తెలుసా' పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీభగవతి, స్వేచ్ఛావతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులకు గురువారం బస్టాండ్‌కూడలిలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. వైసీబీ సంస్థ ప్రాజెక్టు హెల్త్‌ఎడ్యుకేటర్ రవికుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఇచ్ఛాపురం రూరల్: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చని ఎంఎల్‌హెచ్‌పీ ఉప్పాడ కుమారి అన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురువారం పూర్ణాటకంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

గజముఖ.. సెలవిక..!



ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బుడ్డేపుపేటలో గురువారం వినాయక నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. యువతీ, యువకులు డ్యాన్సులు చేస్తూ గణపతి విగ్రహాన్ని స్థానిక బాహుదానదిలో నిమజ్జనం చేశారు.

కుక్కకాటుకు ఐదుగురికి గాయాలు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ టెక్కలిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గురువారం రాత్రి కంద్రవీధికి చెందిన వివేకనంద బెహరా, అక్కపువీధికి చెందిన ఎస్.దుర్గాప్రసాద్, తెలుకల వీధికి చెందిన బి.హేమసుందర్‌లతో పాటు శరత్‌కుమార్, పి.బాలకృష్ణలపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో బాధితులు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.